


స్కూలుమాష్టరు సాంబయ్య రైలు ప్లాట్‌ఫారం మీద నుంచుని రైలుపట్టాలు రెండు గీతలుగా ఎంతో దూరానికి పోయి కలుసుకునేచోట చిన్న నల్లటిఆకారంతో పొగ వొదులుతుంటూ ఢిల్లీఎక్స్‌ప్రెస్ రావటం చూశాడు ఆ బండిలో తన చిన్ననాటిస్నేహితుడూ తనవూరివాడైన సుందరమూర్తి ఎస్తున్నట్టు తనకు జాబు వచ్చింది. షుమారు ఇరవై యేళ్ళకిందట సుందరంవూళ్ళో నుండి అకస్మాత్తుగా అదృశ్యుడవటం జ్ఞప్తికొచ్చింది సాంబయ్యకు వాడు మద్రాసు, బొంబాయి, కలకత్తాల్లో, తిరుగాడుతున్నాడని గాలి వార్తలు

# బహిష్కృతుడు



వస్తున్నప్పుడల్లా సాంబయ్య చెవి కోసుకుని వింటూండేవాడు. చిన్నప్పుడే సుందరంగాడికి కనపడ్డ ఖాళీచోటల్లా బొమ్మలుగీసి ఖరాబు చేసేపిచ్చి వుండటం సాంబయ్యకు యిప్పటికీ జ్ఞాపకం వుంది, ఆ పిచ్చి సుందరం పరారీకి కారణమైందని ఎందర్తోనో చెప్పాడు కూడా. ఎందుకంటే, సుందరం డ్రాయింగు నేర్చుకుంటానికి పట్నం పోతానని వాడినాన్న సుబ్బయ్యపంతుల్తో చెప్పటం, ఆయన వాణ్ణి... "పుండాకోరు వేషాలేస్తే వొళ్ళు హూణం చేస్తా" నన్నమీదట ఇంట్లో కొంత రగడ జరగటం సాంబయ్యకు సూదిలో దారం గుచ్చినంత వయినంగా తెలుసు. అయితే సుందరం బొమ్మలు వేయటంలో ప్రవీణుడై ఆ విద్యతోనే వాడు యిటీవల ఢిల్లీకి చేరి ఘనంగా ధనార్జన చేస్తున్నట్టు విని నిర్ఘాంత పోయాడు సాంబయ్య సుందరం స్థితివంతుడవుతున్నాడనే దుగ్ధతో కాకపోయినా తమ స్నేహాన్ని జ్ఞాపకం చేస్తూ వాడికి సాంబయ్య వుత్తరాలు రాసినమాట మట్టుకు నిజం.

భూమిని అదరగొడ్తూ ఎక్స్‌ప్రెస్‌బండి ధన్‌ధనామంటూ వచ్చి ప్లాట్‌ఫారమంతా ఆక్రమించుకునే గడబిడకు గాని తన స్మృతి కల్లోలంనుండి తెప్పరిల్లుకోలేదు సాంబయ్య సుందరాన్ని సులభంగా గుర్తుపట్టగలిగే ధోరణిలో వున్న సాంబయ్యకు ఆశాభంగం కలిగింది. అది చిన్నస్టేషను అవడంవల్ల ఎక్కే దిగే ప్రయాణీకులు ఓ పదిమందికన్న లేనప్ప



---

మాధవ పెద్ది గోఖలే

---

టికీ ఎక్స్‌ప్రెస్ బండి కూతకూసి ప్లాట్‌ఫారం వొదిలి పోయినా కాసేపటికి గాని ప్లాట్‌ఫారం చివర్న స్టేషను పేరున్న చక్కదగ్గిర చేతిలో మధ్యరకం సూట్‌కేసూ, చంకలో ఓ అట్టలకట్టా, సంచీ తగిలించుకున్న ఒక పొడుగాంటి వ్యక్తిని సాంబయ్య గమనించలేదు అంగలేసుకుంటూ ఒక క్షణంలో ఆ వ్యక్తి దగ్గరకు చేరుకున్న సాంబయ్య "నువు సుందరానివికదూ?" అనడిగాడు రొప్పుకుంటూ.

నలిగిన లాల్చీ, పైజామా, మందపాటి ఫ్రేము కళ్ళద్దాలూ, విశాలంగా వుండి చిట్లిస్తున్న కళ్ళతో "ఏం సాంబయ్యా, బాగున్నావా? నువ్వు నా కోసం నాలుగుమైళ్ళున్న యీ స్టేషనుకు వస్తావనుకోలేదు!" అంటూ నవ్వుతూ వచ్చి సాంబయ్య చెయి పట్టుకున్నాడు సుందరమూర్తి

"ఇందేంట్రా సుందరం, సకుటుంబ సమేతంగా వస్తావనుకుంటే మరీ అతి సాదాగా వస్తే ఎట్లా? సూటూ, బూటూ, హేటూ, బంట్రోతు ల్లగాయతు దర్జా వొలకబోస్తూ దిగుతావనుకుంటే—అసలు విషయం, మన ఆంధ్రులు కాస్త అవసరాన్ని గుర్తించయినా నలుగుర్ని ఆకట్టేట్టుగా పటాటోపం కనబరుస్తారేమోనని చూస్తా—అబ్బే మాటవరసకైనా ఆ మెళుకవ లుంచేగా!" అన్నాడు సాంబయ్య, సుందరమూర్తిని యింకా పరీక్షిస్తూ.

మిత్రులిద్దరూ స్టేషను పక్క పూరి గుడిసె కాఫీహోటల్లో టిఫిన్ తిని సుందరం కోరికమీద వాళ్ళ పల్లెటూరుకు నడక సాగించారు.

"యిక్కడ గుర్రబ్బళ్ళు ప్రయత్నిస్తే దొరుకుతై గాని నాకు అసలు నడకంటే మహాసరదా" అన్నాడు సాంబయ్య, సుందరం పక్క సూటుకేసు పట్టుకు నడుస్తూ.

"బళ్ళంటే నాకు రోత! యిక్కడి దృశ్యాల్ని యీ మాగాణిభూమి గాలి పీలుస్తూ నడుస్తుంటే నా ప్రాణానికి హాయిగా వుంది. యీ పంటచేలల్లో నారుమళ్ళు లెమన్ గ్రీన్ కలర్లో ఎంత అందంగా వున్నయ్! ఆ వెర్మీలియన్ తంగేడు పూలగుంపు చూశావా, ఆ గ్రీన్స్‌లో? అద్భుత సృష్టిగా లేదూ? యీగాలి తగుల్తూనే నాకో ఇరవై య్యేళ్ళ వయస్సు తగ్గినట్టుగా వుంది!!—" అన్నాడు సుందరం గుండెనిండా గాలి పీలుస్తూ.

ధనరాసులూ, దర్జాలొలికే ఢిల్లీలాంటి పట్నాల్లో ఇరవైయ్యేళ్ళుండి వూడిపడిన యీ సుందరం వాలకమేమిటని తన్ను తాను అమాయకంగా ప్రశ్నించుకున్నాడు సాంబయ్య. ఇంతకుముందా పూరిగుడిసె కాఫీహోటల్లో పొయిదగ్గర మట్టినేలమీద తెల్లటి పాలరాయిమీద కూచున్నట్టు బాసీపేటవేసుకుని ఆ ఇడ్లీ పెసరట్లను పంచభక్ష్య పరమాన్నాలల్లే



"అర్టంటే నాకు తెలియదు. ఎక్కడా నేర్చుకోనూలేదు. కాని బొమ్మలు గబగబా అమ్ముడుపోతున్నై."

అపురావుర్న తింటమే కాకుండా ఆ వుప్పు చెమటలో మునిగితేల్తున్న హోటలు వంటవాడికేసి కన్నార్పకుండా ప్రాణమిత్రుడల్లే ఆప్యాయంగా చూట్టం తలుచుకున్న సాంబయ్యకు ఒక్కసారి పచ్చి ఆముదం తాగిన భావం కలిగింది

"ఒరే సుందరం, ఇరవైయ్యేళ్ళ పట్నవాసం గాలితిన్న నీలో యింకా మనపల్లెటూరి వేషాలు పట్టుకు వేళ్లాటం చూసి నాకు నిజంగా ఆశ్చర్యంగా వుంది!" అన్నాడు సాంబయ్య, సరైన ధోరణికి ఎస్తూ.

"నాకు మట్టుకు నిన్ను ఇరవైయ్యేళ్ల కిందటి సాంబయ్యల్లేనే చూట్టం మహానందంగా వుందంటే నమ్ము! దురదృష్ట వశాత్తు సహజత్వాన్ని అట్టిపెట్టుకుంటున్న పల్లెప్రజల వ్యక్తిత్వాలకు నిజంగా మసి ఏర్పడి మరుగుపడ్తే నాలాంటివాళ్లు వురిపోసుకు చావాల్సిందే! పట్నం మొహాలు యంత్రంలో అచ్చయినట్లుంటయ్! వాటిలో స్వాభావికత వుండదని నా నమ్మకం ఎందువల్లంటే, హెచ్చు తగ్గుల పోటీలో వాస్తవాన్ని మరుగు పర్చుకునేందుకు పట్నం మనుషులు ఎన్ని కృత్రిమ సాధనాల్నయినా అనుసరిస్తారు. ఇందాక నువా కాఫీహోటలు వంటవాణ్ణి చూసేవుంటా వనుకుంటా. అతన్లో నాకు రక్తమాంసా లున్నట్లనిపించింది! ఆ పొయ్యి సెగకు చమటలో మునిగితేల్తున్నా, నేను ఇడ్లీ పచ్చడి బాగుందనేసరికి అపుర్న నవ్వాడు! అలాంటి నిర్వికారగుణంగల వ్యక్తిత్వం పట్నాల్లో మచ్చుకైనా కనుపించదు!!" అన్నాడు సుందరం, పెద్దపెద్ద అడుగులు వేసుకుంటూ.

"నీ వుద్దేశ్యాల్ని గురించి నే నేమనుకుంటున్నా నువు పట్నాలకు చేరి ప్రయోజకుడవై మన వూరుకు కీర్తి నార్జించావని నా నమ్మకం. అయితే నువ్విన్నేళ్లూ పట్నవాసుల్ని అసహ్యించుకుంటూనే ప్రయోజకుడవై ధనార్జన ఎలా చేయగలుగుతున్నావో వూహించలేకుండావున్నా!!" అన్నాడు సాంబయ్య, సుందరా న్నోకంట చూస్తూ.

''నువు ఉపాధ్యాయుడివి గనుక విషయం నేను సూక్ష్మంగా చెప్పినా అర్థం చేసుకోగలవనుకుంటా నేను కలలుకన్న చిత్రలేఖన సాధన చేయటా

నికి పట్నాల్లోతప్ప ఆస్కారంలేదు అక్కడ కళల్ని గౌరవించటం, ఎంతో కొంత ఆర్థికంగా ముట్టచెప్పటం, బల వంతంగానైనా తెచ్చిపెట్టుకుంటారు అందుకే నాకిష్టమున్నా లేకపోయినా నేను పట్నాల్లోగాని జీవించలేను. కాని కళాసృష్టికి కావలసిన వైవిధ్యం అక్కడ లభించదని యిటీవలే నేనర్థం చేసుకున్నా ఇన్నాళ్లూ నేను పెద్దపెద్ద వ్యాపారస్తుల అవసరాలకు నా నైపుణ్యం వినియోగించి ధనార్జన చేసిన మాట వాస్తవం. కాని ఆ దౌర్భాగ్య స్థితికీ, కళాభివృద్ధికీ సాపత్యం లేవనే త్రాష్టరిపు జబ్బు కొన్నేళ్ళనుంచి నాలో ప్రవేశించి తినేస్తున్నది ఈ జాడ్యం వల్లనే నేనీనాడు అటు ధనార్జనకూ, యిటు కళాభివృద్ధికీ చెందని దైన్యా వస్తలో వున్నా'' అన్నాడు సుందరం, అంతరిక్షంలోకి చూస్తూ

"డబ్బు పుట్టక రోజు గడవటం సమస్యగావున్న నాలాంటి అభాగ్యుడికి నీ తర్కం వింతగా తోచటం సహజం. ధనార్జన శక్తిపొందిన ఏ ప్రాణి జీవిత మైనా తరిస్తూంటం నాకళ్ళారా చూస్తున్నా! నువ్వూ అంత అదృష్టవం తుడవనే నేనిన్నాళ్ళూ నమ్ముతున్నా'' అన్నాడు సాంబయ్యా.

''సాంబయ్యా, నువు అక్షరాలా ఉపాధ్యాయుడివి! నువు యిన్నేళ్ళుగా వందలకొద్దీ విద్యార్థులకు చేస్తున్న బోధలవల్ల నీకేనాడైనా ఆత్మ సంతృప్తి కలిగినట్టనిపించిదా?" అనడిగాడు సుందరం

''నా విద్యార్థుల్లో ఏకొద్దిమంది విద్యా ధికులైనా నా కాత్మసంతృప్తి కలిగినట్టు రుజువవుతుంది!" అన్నాడు సాంబయ్యా.


''ఆడవారికి నగలాపేక్ష వున్నట్టు సమాజానికి విద్యాధికులు కూడా అంత అలంకారమే ' నేను చిత్రకళలో నైపుణ్యం పొందినంత మాత్రాన నేను వేసే చిత్రాలకు విలువ వుంటుందంటావా సాంబయ్యా?—'' అంటున్న సుందరం మధ్యలోనే బ్రేకువేసినట్టాగిపోయి వెర్రి చూపులు చూస్తూ నిలబడ్డాడు

సన్నగా సాగిన వానజల్లుతో, పడ మటి దిక్కున ఇంద్రధనస్సు ప్రత్య క్షమై వుంటే, ఇరవై గజాలదూరంలో రోడ్డుప్రక్క పశువులమంద వద్ద కోలా హలంగావున్న గొడ్లపిల్లకాయల పక్కన నారుమడి గట్టుమీద ఎర్రచీర పైకి ఎగ్గట్టి ''వానావచ్చే వరదావచ్చే చాకలివాడి బానావచ్చే" అని చేతులూపుతూ ఎగు రుతున్న ఒకమ్మాయిని చూసిన సుందరం, మంత్రించబడిన వాడల్లే యింకొంచెం ముందు రోడ్డుపక్క చింతచెట్టుకిందకు చేరి సంచిలోని తెల్లకాగితాల పుస్తకం తీసి కలంతో బొమ్మలు గీయడం మొదలుపెట్టాడు. ఈ వింత సంఘటన ప్రేక్షకుడల్లే చూస్తున్న. సాంబయ్యా, మెల్లిగావెళ్ళి సుందరం వీపు వెనుక

సుంచుని, అతను బరబర గీకుతున్న గీతల్ని శ్వాస బిగపట్టి చూడసాగాడు సుందరం అతి త్వరగానూ, సునాయాసంగానూ చిక్కిరి బిక్కిరిగా గీస్తున్న గీతలకు ఏర్పడుతున్న చిత్రరూపం చూస్తుంటే ఒక సంగీత పాటకుడు అతి తిక్కమీద విసురుగా రాగాలాపనచేసి పాటనందుకున్నట్లల్లే అనిపించింది సాంబయ్యకు

"ఆ గొడ్లపిల్లలు మనవేపు అనుమానంగా చూస్తున్నార్రా సుందరం-అరుగో యిద్దరు కొక్కిరాయి వెధవలు మన వేపు రానే వస్తున్నారు — చూడు చూడు ఆ ఎర్రచీర చంద్రమ్మ కూడా వస్తున్నది '' అంటున్న సాంబయ్యకు ఒక్కసారి బాకుతో పొడిచినంత చూపు చూసి ఆగీసిన గీతలమీదే యింకా బంగా గీయటం మొదలుపెట్టాడు సుందరం సుందరం చూపుకు వెలాతెలపోయిన సాంబయ్య అప్పటికే వచ్చి చుట్టుముట్టిన గొడ్లజనాన్ని వురిమి చూస్తూ 'మీకేం పన్లేదూ జోరీగలు ముసిర్నట్టు ముసుర్తున్నారూ?'' అనరిచాడు

"సాంబయ్యగోరూ ఏందామడిసి అదేమయిన మాకేసిచూసి సూసి రాస్తా వుండాడూ?" అనంటూ ఎర్రచీరా, నల్లగళ్ళరవికా కొప్పు తెల్లరాయి ముక్కుపుడకా, చెవులకు కమ్మలూ, నవ్వుతున్న కళ్ళతో నల్లగా మెరుస్తున్న ఆ అమ్మాయి,



అదృష్టవంతుడు అంబులెన్సు క్రింద పడ్డాడు.

నోట్లో గడ్డిపోచ నములుతూ ఒయ్యారంగా నడుస్తూ వచ్చి అడిగింది

కన్నార్పకుండా ఆ అమ్మాయిని ఓ దేవకన్యల్లే చూస్తున్న సుందరాన్ని చూస్తున్న సాంబయ్య ''యిది మన వూరి వెంకయ్యా వీరమ్మల కూతురు చంద్రమ్మలే!" అన్నాడు, యీ సంఘటన తొందరగా ముగిస్తే బాగుండు ననుకుంటూ

"ఈయన ఢిల్లీపట్నం లెగిసెల్లిన మన చుబ్బయ్యగారి ఎంకట లచ్చుమ్మ గారబ్బాయిగాదూ? యియ్యాల రవిలు బండికి వత్తాడని అంటావుంటే యిన్నాలె'' అని చంద్రమ్మ అంటున్నదో లేదో — ఎవరికీ తెలియకుండా సుందరం వెనుకనేవున్న చింతచెట్టు పంగల్లోకెక్కిన ఓ గొడ్ల పిల్లకాయ సుందరం చేతిలోవున్న పుస్తకంలో గీతల్ని చూసి ''యీయన సెంద్రమ్మ బొమ్మ గీస్తుండాడహో." అనరుస్తూనే టపీమని చెట్టుమీదనుంచి దూకి, పరు

క్షణంలోనే గొడ్ల మందలోకి దూరి మాయమైనాడు

* * *

ఆమర్నాడు స్కూలు పని ముగించుకునిగాని సుందరాన్ని కలుసుకోలేదు సాంబయ్య మాటకుముందే కళ్ళనీళ్ళు పెట్టుకునే సుందరం తల్లి వెంకటలక్ష్మమ్మ ద్వారా తెలుసుకుని వారి గొడ్ల సావిట్లో ఓ మూలవున్న సుందరాన్ని చూశాడు సాంబయ్య

"ఏమిరోయి సుందరం? అప్పుడే రంగుల రంగంలోకి దిగినట్టున్నావే? చివరకు యీ గొడ్ల సావిట్లోనుట్రా నీ కళాసాధనా? యింకా నయం! యీ సావిట్లో పశువులున్ దూడరేణువులు లేవు!'' అంటూ అక్కడ నులకి మంచంమీద పక్కచుట్ట ఎత్తుగా పెట్టుకుని దానికి పేపరున్నపీట చక్కానానించి ఏదో తైలవర్ణాల్తో వేస్తున్న సుందరాన్ని పలకరించిన సాంబయ్య, అట్లాగే నిలబడిపోయి సుందరం వేస్తున్న బొమ్మను పరీక్షగా చూసి అప్రయత్నంగా నోరు తెరిచాడు

సుందరం చిత్రిస్తున్న ఆ చిత్రం రంగులమీద రంగులెక్కి గంద్రగోళంగా వున్నట్టు ముందు చూడంగానే అనిపించినా ఆ బొమ్మలోని చంద్రమ్మను ఆనవాలు పట్టాడు సాంబయ్య

ఒక జానె డెత్తు పీటమీద ఒక పక్కగా కాళ్ళు ముడుచుకుని, తొడలూ ఒంటినా చీరతొలిగి నడుము విల్లులాగా వంచి, ముందుకు పొడుచుకువచ్చిన స్తనకుంభాల్తో అతి ఒయ్యారంగా తల వొంచుకుని కొప్పులో పూలు ముడుచుకుంటున్నదా నల్లటి స్త్రీ చిత్రం

"సుందరం? నువ్వు వేస్తున్న ఆ బొమ్మ ఎవరిది?" అనడిగాడు సాంబయ్య. మొహాన స్వేదబిందువులు పొటకరిస్తుంటే

"లోకానికి కనపడని ఒక అద్భుత అజ్ఞాత స్త్రీది! నిన్ను కూచోమంటానికి యిక్కడేం కుర్చీలులేవు యీ బోర్లించిన గాబుమీద కూచో ఏం ఎట్లా వుంది వేస్తున్న చిత్రం?" అన్నాడు సుందరం, చిత్రాన్ని పూర్తిచేసే దశలో అక్కడక్కడా రంగులు ఒక వెదురుబద్దతో మెత్తుతూ

"చిత్రంలో ఆ మనిషి చంద్రమ్మల్లే వుంది నాకు" అన్నాడు సాంబయ్య ఆ స్త్రీ మూర్తి అంగాల్ని కన్నార్పకుండా చూస్తూ

"ఈ స్త్రీ ఎవరయిందీ నాకు నిమిత్తం లేదు ఏ దుర్వాసనల ప్రభావానికీ గురి కాని వ్యక్తిత్వం వున్న స్ఫటికంలాంటి మూర్తి! యీ అన్వేషణే నా కళాసాధనకు మూలం యిదిగో యీ రెండో చిత్రం కూడా చూసి నీ అభిప్రాయం చెప్పు"

అంటూ మంచంకోడు బోర్లావేసి ఆనించివున్న అట్టను తీసి సాంబయ్యకు కనపడేట్టు మంచం యివతల వేపు ఆనించాడు సుందరం

ఈ చిత్రం మరీ గంద్రగోళంగావుంది సాంబయ్యకు ఎర్ర చీర పైకి ఎగ్గట్టిన ఒక నల్లటి పడుచు పిల్ల — బహుశా చంద్రమ్మ కావచ్చు — ఒక ఆకుపచ్చ రంగు పేలిక మీద వొయ్యారంగా నుంచుని, చెవిదగ్గిర చెయి పెట్టుకుని పాడ్తున్న ధోరణిలో వుంది ఆ పిల్లవెనుక ఆకాశంలాగా వున్నచోట ఇంద్ర ధనుస్సల్లే రంగుల మీద రంగులెక్కి గజిబిజిగా వుంది ఎడంపక్క ఒక గేద పడ్డ ఏటవాలుగా ఆకాశం వేపు ఎగుర్తూ వుంటే దానితోక పట్టుకుని ఒక గొడ్ల పిల్లకాయ ఆ పశువుతో పాటే పైకెగు ర్తున్నాడు ఆ చిత్రం సాంతం చూసి ఒక్క గుటక, మింగాడు సాంబయ్య

"ఆ చిత్రం పేరు ప్రకృతి రాగం మనం నిన్న ఆ వాన జల్లులో పశువుల మందవద్ద చూసిన ఆ జీవుల మనస్తత్వాలీ చిత్రంలో ప్రతిబింబిస్తున్నయ్" అని చిత్రంలోని లక్ష్యం విషయమై చెపుతున్న సుందరం, సాంబయ్య గొడ్లసావిడి పక్కన సహం పడిన తాటాకుల దడి వేపు చూస్తుంటం గమనించాడు అక్కడ తమవంక చూసీ చూడనట్టు నవ్వుతూ ఎర్ర చీరతో నుంచునుంది చంద్రమ్మ



'ఆ రేగిపళ్ళు తినేటప్పుడు పురుగులుంటాయ్ చూసుకుని తిను "

"నాకేం భయం నేనేం చూసుకోను ఆ పురుగులు నన్ను చూసుకుని అవతలకి పోవాలి "

చంద్రమ్మపూరిగుడిసె ఆ దడి వెనకనే వుందని సాంబయ్యకు తెలుసు

చంద్రమ్మకేసి కొరకొర చూసి "నాకు పనివుంది, మళ్లీ కనిపిస్తా సుందరం" అంటూ గిర్రున తిరిగి భూమిని బలంగా తొక్కుకుంటూ గబగబ వెళ్లిపొయ్యాడు సాంబయ్య

ఒక వారం రోజులతర్వాత అర్ధరాత్రి సమయంలో చంకలో ఒక పక్క సంచీ, యింకో పక్క బొమ్మలకట్టా, చేతిలో సూట్‌కేసుతో సుందరం, సుందరం తండ్రి సుబ్బయ్యపంతులూ ఆ పల్లెటూరుకు మైలు దూరంగా నిశ్శబ్దంగా

వచ్చి రోడ్డుమీద ఎదురెదురుగా నుంచున్నారు

"భ్రష్టుడా, మా కడుపున చిచ్చు పెట్టావు! నా వంశం నశించింది" అన్నాడు సుబ్బయ్యపంతులు బుస కొట్టినట్టు

"నాన్నా, నువు నన్ను అపార్థం చేసుకుంటున్నావు! నాకూ ఆత్మాభిమానం వుంది!" అన్నాడు సుందరం నేలమీద నుంచుంటూ

"మండింది నీ ఆత్మాభిమానం! వూరూ నాడూ ఏకమై ఆ చంద్రమ్మనూ నిన్నూ బజారుకు యీడిస్తే నా తల ఎక్కడ పెట్టుకున్నాను? సహం చచ్చిన మీ అమ్మ రొమ్ములు బాదుకుంది! ఇన్నాళ్లు పరువుగా బతికి బట్టకట్టిన వూళ్లో వెలివేయబడ్డాం! వాళ్లు మమ్మల్ని కాకులు పొడిచినట్లు పొడుస్తారు --నువు ఎక్కడో ఎప్పుడో మాలపెళ్లి చేసుకుంటే ఎవరేడ్చారు! యిన్నేళ్లకు యిప్పుడు మళ్లీ పని పెట్టుకు వచ్చి ప్రత్యక్షంగా మమల్ని సర్వనాశనం చేశావు! ఆ సాంబయ్య త్రాష్టుడు! వాడికీ చంద్రిమ్మకూ సంబంధం వుంది! నువు దాని గుడిసెలో చేరి దాన్ని నగ్నంగా బొమ్మలు వేస్తున్నావని దాని తండ్రీ అన్నల్తో చెప్పి నిన్ను బజారుకు లాగించాడు! యిదిట్రా నీ కళాసాధన? బూతుకూ కళకూ ముడివేసి భ్రష్టత్వంలో పండిపోయినావు!" అన్నాడు సుబ్బయ్య పంతులు, నిప్పురవ్వలు రాలుస్తూ

"కళాసాధనకు సత్యం సౌందర్యం, భావం, ప్రయోజనం బలమైన ఆధారాలు! సాంబయ్య సంబంధాల్తో నాకు ప్రశక్తి లేదు! నా సాధనకు చంద్రమ్మ ఆధారమైంది గనుక బహిరంగంగా నేనా పిల్ల గుడిసెలోకి పోవటంలో తప్పేంత మాత్రం లేదు! యీ విషయం తెలుసుకోలేని వాళ్లు నన్ను బజారు కీడ్చినందుకు నా కావగింజంత విచారం కూడా లేదు! ఎందుకంటే రేపు నే నీ చిత్రాల్ని ప్రదర్శించినప్పుడు నాకు గౌరవం లభిస్తే యీ సాంబయ్య తల నేలకేసి పగులగొట్టుకోడని కూడా నాకు తెలుసు! కాని యీ జరిగిందానికి మీరు అప్రదిష్టపాలైనందుకు నా హృదయం దహించుకు పోతున్నది! మన్నించండి, అంతకన్న మీకు అభత్యంతరం లేకపోతే మీరు ఢిల్లీకి వచ్చి నా భార్యా బిడ్డల్తో వుంటే మే మెంతయినా ఆనందిస్తాము! వెళ్లి వస్తా నాన్నా—" అంటూ ముందుకు సాగిపొయ్యాడు సుందరమూర్తి అప్పుడే ఉదయిస్తున్న చంద్రకాంతిలోకి అదృశ్యమవుతున్న కొడుకును కన్నార్పకుండా చూశాడు సుబ్బయ్యపంతులు

★